

బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు వినతి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి, కర్నూల్ గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.సి.రాయలు న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లోని ఛాంబర్‌లో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి, తిరుపతిలో ప్రధాన కార్యాలయంతో కొత్త బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు ప్రతిపాదనలు సమర్పించారు. తిరుపతి కేంద్రంగా రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. అందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయాన మంత్రి కె. రామ్ మోహన్ నాయుడు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు, నరసరావుపేట ఎంపీ టిడిపి పార్లమెంటు ఫ్లోర్ లీడర్ లావు కృష్ణదేవరాయలు, అనేక మంది కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దిత్వా మిగిల్చిన దిగులు

వందలాది ఎకరాల వరి పంట నీట మునక



ప్రజాశక్తి -దొరవారిసత్రం : ఏడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో నదులు, వాగులు, చెరువులు పొంగి పంట పొలాల వైపు నీరు ప్రవహించడంతో రైతు వేసిన వరి పైరు మొత్తం నీట మునిగాయి. మండల పరిధిలోని ఏకొల్లు. అక్కరపాక, వెదురుపట్టు, తనియాలి, తల్లంపాడు, పూలతోట, సింగనాలత్తురు, మిజూరు, కల్లూరు తదితర పంచాయతీలలో రైతులు వరి పైరు సాగు చేశామని, నేడు తమ కష్ట నీటి పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

స్తంభించిన జన జీవనం.. మండల పరిధిలో కురుస్తున్న భారీ వర్షాలకు ఏర్లు, కాలువలు, చెరువులు ఉధృతంగా ప్రవహిస్తూ ఉన్నాయి. అనేక గ్రామాల్లో వీధులు చెరువులను తలపిస్తున్నాయి. వరద నీటి ప్రవాహంతో కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చలిగాలులకు వృద్ధులు, మహిళలు, గర్భవతులు, చిన్నపిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారు. మూగ జీవులు మృత్యు వాత పడుతున్నాయి. తనియాలి గ్రామ సమీపాన ఉన్న కాళంగి నది, వెదురుపట్టు గ్రామ సమీపన ఉన్న పాముల కాలువ, పూలతోట గ్రామ సమీపాన ఆర్ అండ్ బి రోడ్డు ప్రాంతంలో ఉన్న కన్న కాలువలు ఉధృతంగా ప్రవహించడంతో తాహశీల్దార్ శైలాకుమారి, ఎస్ఐ అజయ్ కుమార్, ఎంపీడీవో గోవర్ధన్, స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆయా ప్రాంతాలకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం పలు లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు.

చలికి వృద్ధురాలు మృతి .. చలిగాలులకు వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఏకొల్లు గ్రామంలో చోటుచేసుకొంది. ఏకొల్లు గ్రామానికి చెందిన అక్కరపాక సావిత్రమ్మ (70)గురువారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్ళి వస్తుండగా చలిగాలికి తట్టుకోలేక మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతిరాలికి ఓ కుమార్తె ఉంది.



మృతి చెందిన సావిత్రమ్మ (ఫైల్ ఫోటో)

దిక్కుతోచని స్థితిలో రైతన్నలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: వర్షాలతో పంట పొలాలు నీటమునిగాయి. కుళ్లిపోతున్న వరి పైర్లను చూసి మండల పరిధిలోని రైతులు దిక్కుతోచక అల్లాడుతున్నారు. పంట నష్టాలు జరిగినప్పుడు



అధికారులు నివేదికలు సేకరిస్తున్నారే తప్ప, నష్ట పరిహారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటకు బీమా చేస్తున్నా ఫలితం దక్కడం లేదని ఆరోపించారు.

అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దార్ శ్రీదేవి.. భారీ వర్షాలకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. స్థానిక తహశీల్దార్ శ్రీదేవి, రెవెన్యూ, సచివాలయ అధికారులతో కలిసి మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్న ప్రాంతాలను, రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బుధవారం రాత్రి కాళంగి రిజర్వాయర్కు వరద పోటెత్తడంతో అధికారులు నాలుగు గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో తాసిల్దార్ శ్రీదేవి కాలువ పరివాహక, లోతట్టు ప్రాంత ప్రజలను హెచ్చరించారు.

వాగులు, వంతెనలను పరిశీలించిన కలెక్టర్



ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్ : వెంకటగిరి టౌన్‌లోని కాంపాలెం, డక్కిలి మండలం లోని మాటుమడుగు–వర్దనపల్లి మధ్య చప్టాల ప్రాంతంలో ఏర్పడిన వరద పరిస్థితిని జిల్లా కలెక్టర్, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గురువారం పరిశీలించారు. కాంపాలెం దగ్గర గొడ్డెరు వాగు, డక్కిలి మండలం మాటుమడుగు వంతెన వద్ద నీటి మట్టం, ప్రవాహం, చప్టాపై వరద ఉధృతి పెరగడంతో పరిసర గ్రామాలకు రాకపోకలు స్తంభించిందని అధికారుల వారికి వివరించారు. వ్యవసాయ భూముల ముంపు, రోడ్లు దెబ్బతినడం వంటి అంశాలపై ప్రజలు కలెక్టర్, ఎమ్మెల్యేలకు వివరించారు. తగు చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

తుపాను బాధితులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే పాశిం.. తుపాను ప్రభావితులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హామీ ఇచ్చారు. గురువారం పట్టణంలోని బొగ్గులుమిట్ట, కాంపాళెం, బంగారుపేట తదితర లోతట్టు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఇళ్లలోకి నీరు చేరిన కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. కాంపాళెం వద్ద గోడ్డేరుపై కొత్త బ్రిడ్జి నిర్మాణానికి కోటి రూపాయల అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. మగ్గం గుంతల్లో నీరు చేరి ఇబ్బందులు పడుతున్న నేత కార్మికులకు అండగా నిలుస్తామన్నారు

దెబ్బతిన్న రహదారులను పరిశీలించిన ఎమ్మెల్యే పాశిం

ప్రజాశక్తి - చిట్టమూరు: మండలం పరిధిలో తుపానుతో దెబ్బతిన్న రోడ్లను, చెరువులను ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నాయుడు – మల్లం, సూళ్లూరుపేట నుంచి తాడి మేడ మీదుగా కోటకు వెళ్లే రహదారులను, చిట్టమూరు, తడిమేడు, కొగిలి చెరువులను పరిశీలించారు.

కల్యాణి డ్యామ్‌లో పెరిగిన నీటిమట్టం

ప్రజాశక్తి - చంద్రగిరి: కురుస్తున్న వర్షాలతో తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలంలోని కళ్యాణి డ్యామ్‌లో నీటిమట్టం పెరిగింది. దీంతో పర్యాటకులను కళ్యాణి డ్యామ్ వద్దకు అధికారులు అనుమతించడం లేదు. గురువారం సాయంత్రానికి 883 అడుగులకు నీటి మట్టం పెరిగిందని అధికారుల తెలిపారు.

ప్రమాదపుటంచున పెరికలంపాటి కండ్రిక



ప్రజాశక్తి - నాయుడుపేట: భారీ వర్షాలతో సాగరమాల రోడ్డు అడ్డుగా ఉండడంతో వర్షపు నీరు పోయే దారి లేక తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం లోని పెరికలంపాటి కండ్రిగ గ్రామం ప్రమాదపుటంచుకు చేరుకుంది. పెరికలంపాటి కండ్రిగ గ్రామ సమీపంలో సాగరమాల రోడ్డు బ్రిడ్జిని ప్రమాణాలు పాటించకుండా నిర్మించడంతో వర్షాలకు తమ గ్రామం నీట మునిగే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి పక్కన ఏర్పాటు చేసిన తూము ఎత్తు ఎక్కువగా ఉండడంతో నీరు పోయే అవకాశం లేక చుట్టుపక్కల నీరు వ్యాపించి రాకపోకలకు ప్రమాదకరంగా మారిందని తెలిపారు. భారీగా నీరు నిలవడంతో గ్రామం నుండి పంట పొలాల్లోకి వెళ్లేందుకు, పశువులను పొలాల్లోకి తీసుకెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. స్థానిక టిడిపి నేత బల్లి ముత్యాలయ్య ఇచ్చిన సమాచారం మేరకు విన్నమాల వీఆర్వో మనోజ్ కుమార్ సాగరమాల బ్రిడ్జి, తూములను, గ్రామాన్ని చుట్టుముట్టిన వర్షపునీటిని పరిశీలించారు. సాగరమాల బ్రిడ్జి పక్కన ఏర్పాటు చేస్తున్న తూమును వర్షపు నీరు పోయే విధంగా ఏర్పాటు చేసి తాము పొలాల్లోకి పోయే మార్గం ఏర్పాటు చేయాలని పెరికలంపాటి కండ్రిగ గ్రామస్తులు కోరుతున్నారు.

జలదిగ్బంధంలో నదీ పరివాహక ప్రాంతాలు

ప్రజాశక్తి -కోట : ఎడతెరిపి లేని వర్షాలతో మండల పరిధిలోని చెరువులు, వాగులు, కాలువులు, స్వర్ణముఖి నది ప్రాంతాలు జల దిగ్బందంలో చిక్కుకున్నాయి. గురువారం తిరుపతి జిల్లా అధికారులు చీఫ్ ఇంజినీర్ వరప్రసాద్, సూపరింటెండింగ్ ఇంజినీర్ డి.రాధా కృష్ణ మూర్తి, గూడూరు ఈ ఈ బాబు ఆధ్వర్యంలో కోట మండలంలోని దైవాలా దిబ్బ, పుచ్చలపల్లి, అల్లంపాడు, మరమ్మత్తులకు గురైన పలు గ్రామాల చెరువులను పరిశీలించారు. చెరువుల వద్దకు చేరుకుని ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు, స్థానిక నాయకులును వాటి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలను అప్రమత్తం చేసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ కటారి జయ జయ రావు, ఇరిగేషన్ అధికారులు ఏఈ మునిరత్నం, వర్క్ ఇన్స్పెక్టర్ అబ్దుల్లా, సర్వేయర్ గోపిరెడ్డి, శ్రీ కనుపూరు ముత్యాలమ్మ దేవస్థానం చైర్మన్ చిల్లకూరు దశరదరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలించాలి : కలెక్టర్.. తుపాను ప్రభావంతో పొర్లు కట్టలకు గండ్లు పడే అవకాశం ఉన్నందున ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కోట మండలంలో పర్యటించారు. పుచ్చలపల్లిలో నివసిస్తున్న అందరిని పునరావస కేంద్రాలకు తరలించాలని సూచించారు. గ్రామానికి సమీపంలోని స్వర్ణముఖి నదిని పరిశీలించారు. నదిలో వరద ప్రవాహం ఉధృతంగా ఉండటం, పొర్లు కట్టలు బలహీనంగా ఉండడంతో కట్టలకు గండ్లు పడే ప్రమాదం ఉన్న దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ కే.జే జే రావు,సర్వేయర్ గోపిరెడ్డి,సీఐ హుస్సేన్ బాష,ఇరిగేషన్ ఏ ఈ మునిరత్నం,తదితరులు ఉన్నారు.

జేసీబీతో వర్షపు నీరు తొలిగింపు.. కోట మండలం, చెందోడు గ్రామ పంచాయతీలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంచాయతీ పరిధిలో విద్యుత్ సబ్ స్టేషన్, ప్రకాశం కాలనీల్లో రోడ్లపై వర్షపు నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు, స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి దిలీప్ కుమార్ నాయక్ సూచనల మేరకు, గూడలి పంచాయతీ టీడీపీ నాయకుడు పల్లెమల్లు వెంకటకృష్ణారెడ్డి, చెందోడు పంచాయతీ టీడీపీ నాయకులు బందెల రఘురామ్,సెక్రటరీ యస్. కిరణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో ఎన్‌బికెఆర్ ఇన్స్టిట్యూట్, కాంపౌండ్ వాల్ వద్ద నుండి వస్తున్న అధిక వర్షపు నీటి ప్రవాహాన్ని జేసీబీ సాయంతో అదుపు చేయించారు. దీనితో అన్ని ప్రాంతాలలో వర్షపు నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. అదేవిధంగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో టీడీపీ నాయకులు స్పందించి నివాసగృహాలకు ట్యాంకర్‌లను ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి నీటిని అందించారు. కాలనీ వాసులు టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉప్పొంగిన కైవల్య, పంబ లేరు వాగు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ :భారీ వర్షాలతో ఎగువ ప్రాంతాల నుండి వరద నీరు రావడంతో గూడూరు మండలం, తిప్పవరప్పాడు సమీపంలో ఉన్న చప్టాపై.. కైవల్యా కాలువ ప్రవహించడంతో గూడూరు–రాపూరు, పొదలకూరు మార్గాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేములపాలెం వద్ద రోడ్లపైకి నీరు చేరడంతో విందూరు, మిత్తత్మకూరు మార్గంలో పలు గ్రామాలకు అధికారులు రాకపోకలు నిలిపివేశారు. గూడూరు మండల పరిధిలో పంట పొలాలు నీట మునిగాయి. పంబ లేరుకు భారీగా వరద నీరు చేరడంతో రాకపోకలను నిలిపేశారు. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు, పునరావాస కేంద్రాలకు వెళ్లాలని, అత్యవసర పరిస్థితుల్లో మున్సిపల్ కంట్రోల్ రూమ్ నెంబర్ 08624 295854 కు సంప్రదించాలని గూడూరు పురపాలక కమీషనర్ వెంకటేశ్వర్లు సూచించారు.

అండగా ఉంటా : గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్



గూడూరు పట్టణ సమీపంలోని, చవటపాళెం గ్రామాన్ని వరద నీరు ముంచెత్తింది. వీధుల్లో వర్షపు నీరు భారీగా ప్రవహించింది. స్థానికులకు పాఠశాలలో పునరావాసం కల్పించారు. అధికారులు జెసిబిలతో కాలువలు తీసి నీటిని వెలుపలికి పంపించారు. ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ గురువారం చవటపాళెంలో పర్యటించారు. పునరావాస కేంద్రాలలోని ప్రజలను పరామర్శించారు. బాధితులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అధికారులను అప్రమత్తం చేశారు.

పాలకులకు పట్టింపు లేదా..?


ప్రజాశక్తి - వాకాడు: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వరదలకు ప్రజలు అల్లాడుతున్నా వాకాడు మండల పరిధిలోని నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదు. కోట, చిట్టమూరు మండలాల్లో ఎమ్మెల్యే పర్యటించి నాయకులను అప్రమత్తం చేశారు. కానీ వాకాడు వైపు మాత్రం కన్నెత్తి చూడలేదు. వాకాడు అంటే చిన్నచూపా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు వారి దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరిస్తున్నప్పటికీ, నాయకులకు ఎందుకంత చిన్నచూపని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జలదిగ్బంధంలో హాస్టళ్లు, పాఠశాలలు



ప్రజాశక్తి -ఏర్పేడు : భారీ వర్షాలతో మండల పరిధిలోని పలు పాఠశాలలు, హాస్టళ్లలోకి వర్షపు నీరు చేరుకుంది. నీరు చేరడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. ఏర్పేడు ఆదర్శ ప్రాథమిక పాఠశాల జలదిగ్బంధంలోకి చేరింది. ఆట స్థలం ఆవరణంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టి ఎత్తు పెంచడంతో వర్షం వస్తే నీరంతా పాఠశాలలోనికి చేరుతుంది. పాఠశాలకి చుట్టుప్రక్కల కూడా నిర్మాణాలు పెరిగి, పాఠశాల పల్లంగా మారింది. అధికారులు తగు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఏర్పేడు బీసీ హాస్టల్ ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వసతి గృహ సంక్షేమ అధికారి పల్లా వెంకటేశ్వర్లుని వివరణ కోరగా భారీ వర్షాలు నేపథ్యంలో హాస్టల్ ఎదుట నీరు నిల్వవుంటుంది, దీంతో విద్యార్థులకి ఇబ్బందిగా ఉంది.గురువారం టిడిపి మండల అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు, ఎంఈఓ ప్రేమలత, సర్పంచ్ నల్ల పాలెం శివయ్య హాస్టల్ కొచ్చి పరిశీలించారు. సర్పంచ్ శివయ్య స్పందించి మట్టి తోలుస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఎంఈఓ ప్రేమలత, టిడిపి మండల అధ్యక్షులు పేరం నాగరాజు నాయుడు, సర్పంచ్ శివయ్య, కృష్ణవేణి ఏర్పాటు ప్రాథమిక పాఠశాల మరియు హాస్టల్ సందర్శించి జెసిబితో వర్షపు నీటిని బయటకు తీసివేయడం జరిగింది. సమస్యను ఉన్నతాధికారులకు తెలియపరచి త్వరలో శాశ్వత పరిష్కారం చేపడతామని తెలిపారు.

దెబ్బతిన్న కల్వర్టు.. పొలాల్లో ఇసుక మేటలు .. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ముసలిపేడు దగ్గర ఆర్ పి కే రోడ్డు 21/0–2 కల్వర్టు దెబ్బతినింది. కాలువ ఆక్రమణలకు గురవుతోందని దీంతో, వర్షాకాలంలో వరద నీరు పొలాలపై పారుతుండడంతో వందల ఎకరాల వరి పైరు నీట మునుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు, మాజీ సర్పంచ్, టిడిపి బూత్ ఇంచార్జ్ మనోహర్ నాయుడు కోరారు.



ట్రస్ట్‌లపై టిటిడి ఈవో సమీక్ష

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర సర్వశ్రేయ ట్రస్ట్, శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్ట్, శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్‌లపై టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్ సమీక్ష నిర్వహించారు. టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో గురువారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, టిటిడి విద్యా సంస్థలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు విద్యతో పాటు సనాతన ధర్మం, నైతిక విలువలు, భక్తిభావం, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై బోధన చేసే వారు ఆదర్శవంతమైన పౌరులుగా తయారవుతారన్నారు. విద్యను అభ్యసిస్తున్న పిల్లలకు మెరుగైన ఉద్యోగ శాతం పెంచేలా నిపుణులతో శిక్షణ ఇప్పించాలన్నారు. అదేవిధంగా, శ్రవణం ప్రాజెక్ట్ పిల్లలకు శిక్షణ పూర్తి అయ్యాక వినికిడి యంత్రాలను పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. టిటిడి ఆసుపత్రులలో రోగులకు ఆసుపత్రుల వారీగా మందుల కొరత ఎక్కడ వుంది, ఏ ఏ మందులు అవసరం ఉంది, రోగులకు అవసరమైన మందులను ఎప్పటికప్పుడు గుర్తించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా, ఆసుపత్రులలో రోగుల వ్యాధులలో తీవ్రమైన కేసులు, ప్రత్యేకమైన కేసులను నయం చేసేందుకు శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్ నిధులను ఉపయోగించాలన్నారు. టిటిడి ఆసుపత్రులలో ఔషధాల సరఫరా, ఔషధాల కొనుగోలు ప్రక్రియ, మౌళిక సదుపాయాలను ఎప్పటికప్పుడు గుర్తించేందుకు 9 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి నివేదిక తయారు చేయించాలన్నారు. తిరుమలలోని పిహెచ్‌సి – 5లో అవసరమైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బందిని నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, ఎఫ్ఏఅండ్‌సీఏవో బాలాజీ, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్, బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జి. జగదీశ్, సీఎంఓ డాక్టర్ కుసుమ కుమారి, పద్మావతి చిన్న పిల్లల ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, డీఈవో వెంకట సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు త్వరలో అనుమతులు



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలో కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సిఐఐ సమ్మిట్ ద్వారా నూతనంగా 61 ఎంఎస్ఎంఈ కంపెనీలు ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయని, దీని ద్వారా జిల్లాకు రూ.43979 కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సిఐఐ భాగస్వామ్యం సదస్సు పెట్టుబడిదారుల సమావేశం, జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి)పై సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన పరిశ్రమల స్థాపనకు పెద్దపేట వేస్తున్న తరుణంలో ఎంఎస్ఎంఈ పరిశ్రమలను తిరుపతి జిల్లా పరిధిలో స్థాపించడానికి, ఏర్పాటు అయిన పరిశ్రమల్లో యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించేలా పరిశ్రమల శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది నవంబర్ 14, 15న జరిగిన సిఐఐ పార్ట్నర్షిప్ సమ్మిట్ ద్వారా జిల్లాలో పరిశ్రమలు, ఐటీ పరిశ్రమలు, పర్యాటక ప్రాజెక్టులు స్థాపించడానికి 61 మంది ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నారన్నారు. ఈ ఒప్పందాల ద్వారా జిల్లాలో 118194 మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. సింగల్ డెస్క్ విధానంలో 1821 పరిశ్రమలకుగాను ఇప్పటివరకు 1755 అనుమతులు మంజూరు చేసామని, మరో 56 పరిశ్రమలకు సంబంధించి అనుమతులు పరిశీలనలో ఉన్నాయన్నారు. పరిశ్రమల పరిశీలన కమిటీకి అందిన మేరకు 13 పరిశ్రమలకు ప్రోత్సాహకాలుగా రూ.77.44 లక్షలు అందించడానికి ఆమోదించామన్నారు. పెట్టుబడి సబ్సిడీ 2, విద్యుత్ సబ్సిడీ 9, వడ్డీ రాయితీ 1, స్టాంపు డ్యూటీ 1 యూనిట్లకు ఆమోదించమన్నారు. క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం ద్వారా ప్రింటింగ్ క్లస్టర్, తిరుపతి కలంకారీ క్లస్టర్, నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్, ఫోటో ఫ్రేమ్స్ క్లస్టర్ ఏర్పాటుకు చేపట్టిన చర్యల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్ మరియు ఫోటో ఫ్రేమ్స్ క్లస్టర్, తిరుపతి రాష్ట్ర స్థాయి ఆమోదం పొంది ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి ఆమోదం కొరకు పంపారని అధికారులు కలెక్టర్ కు వివరించారు. పరిశ్రమలకు సంబందించిన అనుమతులు వివిధ శాఖల అధికారుల వద్ద ఉన్న పెండింగ్ అంశాలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఏపిఐఐసి ద్వారా భూమి కేటాయించబడిన పరిశ్రమలు వివిధ దశలలో వున్నాయని, ఇంకా ప్రారంభించని వాటిని త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ కంపెనీల పెట్టుబడిదారులు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, జోనల్ మేనేజర్ ఏపిఐఐసి తిరుపతి విజయ భరత్ రెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రామకృష్ణారెడ్డి, రవాణాశాఖ అధికారి మురళి మోహన్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి లోకనాథం, డిఆర్ డిఎ పీడీ శోభన్ బాబు, జిల్లా అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

రుయాలో అరుదైన శస్త్ర చికిత్స



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి రుయా ఆసుపత్రిలో పిడియాట్రిక్ వైద్య బృందం బాలుడికి అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. రుయా చిన్న పిల్లల ఆసుపత్రి పిడియాట్రిక్ సర్జన్ డాక్టర్ ఏబి జగదీష్ గురువారం ఆసుపత్రి ప్రాంగణంలో విలేకర్లతో మాట్లాడుతూ పులివెందుల, రాజీవ్ కాలనీకి చెందిన 3 ఏళ్ల మహీ నాలుగు రోజుల క్రితం ప్లాస్టిక్ క్యాప్‌ను మింగడంతో అది ఊపిరితిత్తుల్లో ఇరుక్కుపోయింది. దగ్గు, శ్వాసకోశ సమస్యలతో బాలుడు రుయా చిన్నపిల్లల ఆసుపత్రికి వచ్చారని, ఆసుపత్రి వైద్యులు బాలుడికి సీటీ స్కాన్ నిర్వహించారని, ఇందులో బాలుడు ఊపిరితిత్తుల్లో ప్లాస్టిక్ క్యాప్ కనిపించిందన్నారు. పీడియాట్రిక్ వైద్య బృందం రిజిడ్ బ్రోంకోస్కోపీ ద్వారా ఆ క్యాప్‌ను సాఫీగా బయటకు తీశారని తెలిపారు. ఇలాంటి అరుదైన ఆపరేషన్ రుయా హాస్పిటల్‌లో చేయడం ఇదే మొదటి సారి అని, బాలుడికి అరుదైన ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించామన్నారు. చిన్నారి ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నాడని తెలిపారు. రుయా ఆసుపత్రిలో అత్యాధునిక పరికరాలతో అరుదైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. రోగులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన రుయా వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ రాధా అభినందించారు.

రహదారి కనెక్టివిటీపై ప్రశ్నించిన ఎంపీ



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: చెన్నై, తిరుపతి యాక్సెస్ కంట్రోల్ హైవే ప్రాజెక్ట్ ప్యాకేజ్ 2కు సంబంధించిన ప్రజా ప్రయోజన అంశాలపై లోక్‌సభలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇచ్చింది. ఈ మార్గంలో గ్రామాలు, కాలనీలు, ప్రభుత్వ సంస్థలు, యాత్రికుల సౌకర్యం దృష్ట్యా అదనంగా ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, వెహికల్ అండర్‌పాస్‌లు, లైట్ వెహికల్ అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు వంటి కనెక్టివిటీ సౌకర్యాలు అవసరమని ఎంపీ గతంలోనే కేంద్ర రహదారుల శాఖ దృష్టికి తీసుకెళ్లారు.ఈ నేపథ్యంలో గురువారం పార్లమెంటులో ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర రహదారి రవాణా మంత్రి నితిన్ గడ్కరీ సమాధానం ఇస్తూ యాక్సెస్ కంట్రోల్డ్ హైవేలో ఇప్పటికే రెండు వైపులా సర్వీస్ రోడ్లు, కీలక ప్రాంతాల్లో అనేక వెహికల్ అండర్‌పాస్‌లు, లైట్ వెహికల్ అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు, వెహికల్ ఓవర్ పాస్‌లు, ఎంట్రీ, ఎగ్జిట్ ప్రణాళికలో భాగంగా అమలు జరుగుతున్నాయని తెలిపారు. అయితే జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఇంకా మెరుగైన కనెక్టివిటీ కోసం ఎంపీ గురుమూర్తి సూచించిన కొన్ని అంశాలను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశీలించింది. ఇందులో భాగంగా తిరుపతి పరిధిలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలోని టయోటా షోరూమ్, కొత్రమంగళం వద్ద అదనపు వాహన అండర్‌పాస్ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.ఈ కొత్త అండర్‌పాస్ సమీప గ్రామాల ప్రజల రాకపోకలకు ఎంతో తోడ్పడుతుంది. అయితే యాక్సెస్ కంట్రోల్ హైవేల భద్రతా ప్రమాణాల ప్రకారం ఎక్కువ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఏర్పాటు చేయడం ప్రమాదకరమని, అది ట్రాఫిక్ వేగాన్ని నియంత్రిస్తుందని కేంద్రం స్పష్టం చేసింది. దీంతో తాజ్ హోటల్, కలెక్టర్ కార్యాలయం సమీపంలో కోరిన ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు సాంకేతికంగా సాధ్యం కాదని మంత్రి తెలిపారు. ఇప్పటికే సమీపంలో ఉన్న ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను వినియోగించుకోవచ్చని వివరించారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా తడుకు, వి.కె.ఆర్.పురం, నేతంకండ్రిగ, పుత్తూరు, అవిలాల, తూకివాకం, ఎలమండ్యం, మల్లవరం, తొండవాడ తదితర అనేక గ్రామాలకు కనెక్టివిటీ కల్పించే నిర్మాణాలు ఇప్పటికే ప్రణాళికలో ఉన్నాయని కేంద్రం తెలిపింది. భద్రతా నిబంధనలు అనుమతించని చోట్ల ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తూ ప్రాజెక్ట్‌ను వేగంగా పూర్తి చేస్తామని మంత్రి నితిన్ గడ్కరీ భరోసా ఇచ్చారు.

స్మార్ట్ సిటీ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయండి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ చైర్మన్, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ 41 బోర్డు సమావేశం స్మార్ట్ సిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. స్మార్ట్ సిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు, ఇండిపెండెంట్ డైరెక్టర్లు డాక్టర్ రమాశ్రీ, డాక్టర్ రామచంద్రా రెడ్డి, ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు ఆన్లైన్ ద్వారా పాల్గొనగా, తుడా కార్యాలయం నుండి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య పాల్గొని పలు అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. నగరంలో సిసి కెమెరాల ఏర్పాటు ప్రదేశాలు, పెండింగ్ ప్రాజెక్ట్‌ల గూర్చి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, కమిషనర్ వివరించారు. స్మార్ట్ సిటీకి నిధులు మంజూరు చేసేలా ప్రభుత్వానికి లేఖ రాయాలని కలెక్టర్ స్మార్ట్ సిటీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, ఈ.ఈ.రవి, డి.ఈ.లు మధు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను కాపాడుకుందాం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: అప్పలాయగుంట చెరువు భూమిలో కొంతమంది రైతులు వారికి పట్టాలిచ్చారని సీసీఎల్ఎ కోర్టుకు వెళ్లారు. దీనికి వ్యతిరేకంగా శ్రీకాళహస్తి రెవెన్యూ అధికారులు వ్యాజ్యం దాఖలు చేశారు. వాదోపవాదాలు తర్వాత సిసిఎల్ఏ కోర్టు రెవెన్యూ శాఖకు అనుకూలంగా తీర్పునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత మాట్లాడుతూ భావితరాలకు చెరువులను కాపాడి ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కోర్టులో రెవెన్యూకు అనుకూలంగా తీర్పురావడం హర్షణీయమన్నారు. జిల్లా పరిసర ప్రాంతాల్లో చాలా చెరువులు ఆక్రమణకు గురి అవుతున్నాయని, వీటిపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. ఇటీవల కొందరు కబ్జాదారులు ఓటేరు చెరువుని పూడ్చడానికి ప్రయత్నించగా, దాన్ని రైతులు, అన్ని పార్టీల ప్రతినిధులు కలిసి అడ్డుకున్నామని గుర్తు చేశారు. కుర్ర కాలువ చెరువు కూడా ఆక్రమణకు గురైందని దాన్ని కలుజు పూడ్చి ప్లాట్స్ వేసి అమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అవిలాల చెరువు తిరుపతి చుట్టుపక్కల చాలా కాలనీలకు, గ్రామాలకు నీటి మట్టం పెరుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. నేడు ఆచెరువు రూపురేఖలు మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చెరువులోకి వెళ్లాల్సిన నీరు మొత్తం తిరుపతి మీద పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. మాల్వాడి గుండం, కపిలతీర్థం నీళ్లన్నీ ఆ చెరువుకి మళ్ళించి తిరుపతిలో కరువు రాకుండా కాపాడాలని ఆమె కోరారు.

ప్రోటోకాల్ పొందుతూనే రాద్ధాంతమా..?



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రోటోకాల్ పొందుతూనే ప్రోటోకాల్ పాటించడం లేదంటూ అనవసర రాద్ధాంతాలు చేస్తూ, ఆది నుండి తెలుగుదేశం పార్టీకి కష్టపడిన కార్యకర్తలను, నాయకులను పక్కనపెట్టి వైసిపి నాయకులకే ఎమ్మెల్యే ఆదిమూలం ప్రాధాన్యమిస్తున్నారని ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చందన స్రవంతి ఆరోపించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో సత్యవేడు నియోజకవర్గ టిడిపి నాయకులతో కలిసి ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యేగా ఆదిమూలం స్థానికంగా ఉన్న టిడిపి నాయకులతో అంటి అంటునట్టు వ్యవహరిస్తున్నారని, నియోజకవర్గ పరిస్థితిని గమనించిన అధిష్టానం పరిశీలకుడిగా శంకర్ రెడ్డిని నియమించిందని, ఈయన ఆధ్వర్యంలో నియోజకవర్గంలో వర్గ విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరిని ఐక్యం చేసుకుంటూ ముందుకెళుతున్న తరుణంలో ఎమ్మెల్యే ఆదిమూలం ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కాకుండా తన సొంత ప్రయోజనాల కోసం పార్టీ క్యాడర్ను అడ్డుపెట్టుకొని వ్యవహరిస్తున్నారని, ఇలా ఉండే కన్నా ఉత్తమంగా పక్కకు తప్పుకోవడమే ఎమ్మెల్యే ఆదిమూలంకు మంచిదని సూచించారు. అలాకాకుండా లేనిపోని సమస్యలను సృష్టించడం చేస్తే అధిష్టానం తీసుకునే నిర్ణయానికి బాధ్యుడు కాక తప్పదు అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు నెల్సన్ మండేలా, జ్ఞాన కుమార్, దశరథ, శ్రీనివాసులు, రమేష్, ధన శేఖర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమేద్దాం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:ప్రాణాంతక ఎయిడ్స్ మహమ్మారిని సమాజం నుంచి తరిమేద్దామని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన పెంచుకోవాలనీ, క్షణికావేశాలకు దగ్గరయ్యే పరిస్థితులకు దూరంగా ఉంటే ప్రాణాంతక వ్యాధిని తరిమికొట్టినట్టేనని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ నరసింహ వర్మ, అధ్యాపకులు సత్యనారాయణరెడ్డి, పరంధామయ్య, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ బాల్ పోటీలకు తనుశ్రీ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పుత్తూరు జిల్లా పరిషత్ హై స్కూల్ మెయిన్ విద్యార్థి వైపెన్ తనుశ్రీ, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు శశికళ తెలిపారు. శశికళను పలువురు అభినందించారు.

భూసార పరీక్షలు చేయించండి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం నేల ఆరోగ్యానికి మంచిదని, తిరుపతి జిల్లా కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు సౌభాగ్య లక్ష్మి పేర్కొన్నారు. తిరుపతి, జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సౌభాగ్య లక్ష్మి మాట్లాడుతూ భూసార పరీక్షలతో రైతులకు కలిగే ఉపయోగాలను తెలిపారు. పండిన పంటలు కూడా ఆరోగ్యవంతమైనవిగా ఉంటాయని తెలిపారు. కనుక భూసార పరీక్షలు తప్పక చేయించుకుని, వాటి ఆధారంగానే ఎరువుల వాడకం, యాజమాన్య పద్ధతులను చేపట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరులకేంద్రం అధికారులు, సిబ్బంది, పుత్తూరు మండల వ్యవసాయ అధికారి కోదండయ్య, పుత్తూరు మండల రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు మట్టం శ్రావణి రెడ్డి భరోసా



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అండగా ఉంటా... అధైర్య పడకండని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి గిరిజనులకు భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావంతో చెన్నూరు, రామలింగయ్య కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, నేపాల్ కాలనీ గిరిజనుల ఇళ్లలోకి నీరు చేరడంతో 700 మందికి భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున గిరిజనులందరినీ ప్రభుత్వ హాస్టల్, ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇందుకూరు శ్రీకాంత్ రెడ్డి, రమావుహేమంత్ రెడ్డి, అల్లం క్రిష్ణయ్య, ధర్మరాజులు స్వామి మెంబర్, తుమ్మల రాఘయ్య, గుర్రాల శ్రీనివాసులు, కోలా అశోక్, రెవిన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాలకు విరాళం

ప్రజాశక్తి - వాకాడు: తిరుపతికి చెందిన ఇండో-మిమ్ లిమిటెడ్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా మరోసారి తమ సేవా దృక్పథాన్ని చాటుకుంది. వాకాడు ప్రభుత్వ ఐటిఐ సంస్థ నైపుణ్యాభివృద్ధి, కేంద్రం మౌలిక వసతుల అభివృద్ధికి 9 లక్షల 50 వేల రూపాయలను విరాళంగా అందించింది. కంపెనీ హెచ్ ఆర్ మేనేజర్ దాసరి కిరణ్ కుమార్ గురువారం కళాశాల యాజమాన్యానికి చెక్కును అందజేశారు. విద్యార్థుల శిక్షణ సదుపాయాల అభివృద్ధికి ఈ నిధులు వినియోగించనున్నట్లు తెలియజేశారు. ఇండో-మిమ్ ప్రతినిధులు మాట్లాడుతూ, విద్యా రంగం, వృత్తి శిక్షణ వంటి సామాజిక అవసరాలపై కంపెనీ ఎల్లప్పుడూ ప్రత్యేక దృష్టి పెట్టుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.రమాదేవి, ట్రైనింగ్ ఆఫీసర్ వి.నాగరాజు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం విద్యార్థి సంబంధాల అధికారి డాక్టర్ జి. రామచంద్రరావు పేర్కొన్నారు. గురువారం ఆయన కళాశాల అసోసియేట్ డీన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రెండవ దశ క్రీడా సాంస్కృతిక పోటీలను, శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో శుక్రవారం నుంచి నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్నామని వివరించారు. వివిధ కళాశాలలనుండి 642 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

చంద్రగిరిలో మెగా పిటిఎమ్ 3.0

ప్రజాశక్తి - చంద్రగిరి: విద్యాశాఖ వారి ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించనున్న మెగా పిటిఎమ్ 3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, గురువారం చంద్రగిరి మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల విద్యాశాఖ అధికారులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష ఎపిసి గౌరీ శంకర్ హాజరయ్యారు. ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి, తల్లిదండ్రులు.. ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని సూచించారు. తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి సురేష్ మాట్లాడుతూ మెగా పిటిఎమ్ నిర్వహించే రోజున ప్రతి పాఠశాలలో విద్యార్థులకు తల్లిదండ్రులకు బఎఫ్‌పి, స్మార్ట్ టీవీ ల ద్వారా ఎస్సీఈ సూచనలు వీక్షించ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ వెంకటరమణారెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శుక్రవారం, చంద్రగిరి పంచాయతీ, బాలికల కళాశాలలో నిర్వహించే మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే పాల్గొంటారని చంద్రగిరి మండల టీడీపీ ప్రెసిడెంట్ బాలకృష్ణ మూర్తి, కార్యదర్శి కొండూరు ప్రవీణ్ ఓ ప్రకటనలో తెలియజేశారు.

డిడిఓ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన డివిజనల్ డెవలప్మెంట్ కార్యాలయాలను రాష్ట్రవ్యాప్తంగా చిత్తూరు నుండి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గురువారం ప్రారంభించారు. తిరుపతి డివిజన్ డిడిఓ కార్యాలయాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే నాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో పంచాయతీలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. తిరుపతి డివిజన్ డిడిఓ జివి నారాయణరెడ్డిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా తిరుపతి డివిజన్ డిడిఓ జివి నారాయణరెడ్డి మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై పర్యవేక్షణకు డిడిఓ కార్యాలయాలను ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం డిడిఓ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మధు, పుదిపట్ల గ్రామపంచాయతీ సర్పంచ్ బడి సుధా యాదవ్, సింగిల్ విండో చైర్మన్ వేమూరు మధు, అధికారులు పాల్గొన్నారు. డిడిఓ కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

విద్యుత్ సౌకర్యం కల్పించండి : సిపిఎం



ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలం, పేరడం గ్రామంలో నూతనంగా ఏర్పడిన గిరిజన కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని సిపిఎం కార్యదర్శి మెలుగు రమేష్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 సంవత్సర నుండి 40 కుటుంబాల వారు గిరిజనులు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని సత్యవేడులో నిర్వహించాన గ్రీవెన్స్ సెల్‌లో వినతి సమర్పించినట్లు తెలిపారు. ఎంపీడీవో తమ వినతిని విద్యుత్ శాఖ ఏఈకి ఎండార్స్ చేశారన్నారు. విద్యుత్ శాఖ ఏఈ, తహశీల్దారు అనుమతి పత్రం ఇవ్వాలని తెలిపారన్నారు. తహశీల్దారుకు వినతి సమర్పించగా, ఆయన నో అబ్జెక్షన్ లేఖ మంజూరు చేశారని తెలిపారు. ఈ అనుమతిపై విద్యుత్ శాఖ ఏఈ మరలా, నాగలాపురం విద్యుత్ శాఖ ఏడికి అర్జీ పెట్టుకోమని తెలియజేశారన్నారు. ఏడీకి వినతి సమర్పించగా ఆయన, కలెక్టర్‌కు అర్జీ పెట్టుకోమని సూచించారని తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్ డే రోజున వినతి సమర్పించాగా, ఆయన 15 రోజుల లోపల ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా పేరడం గ్రామ గిరిజన కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని విద్యుత్ శాఖ సూపర్ ఇంటెంటింగ్ ఇంజనీర్ వారిని ఆదేశించారన్నారు. కానీ విద్యుత్ శాఖ అధికారులు ప్రతి కుటుంబం నుండి ఆన్‌లైన్‌లో రూ.500 చెల్లిస్తే విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారన్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు గిరిజనుల నుండి ఫోటో తీసుకొని కలెక్టరేట్‌కు సమస్యను పరిష్కరించినట్లు నివేదిక పంపారని ఆరోపించారు. కానీ విద్యుత్ సౌకర్యం మాత్రం నేటికీ కల్పించలేదని మండిపడ్డారు. వర్షాల నేపథ్యంలో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారని, విష కీటకాలతో రాత్రిళుఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు గిరిజనులపై వివక్ష చూపడం న్యాయం కాదని, తక్షణమే విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గిరిజన, దళిత సంఘాలను ఏకం చేసి పోరాడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అరుణాచలం, కృష్ణయ్య, విజయభాస్కర్, కొల్లాపూరి తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్టీయూ న్యూ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: ఈ నెల 8,9 తేదీల్లో గుంటూరులో జరుగుతున్న అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (న్యూ)రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ పల్లె వీధి, కాళహస్తి శేషయ్య స్మారక గ్రంథాలయంలో గురువారం గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చింతగింజల చినఓబయ్య, నీలా సుబ్బరాయులు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్ల అమలుతో కార్మికుల హక్కులకు కాలం చెల్లుతుందని హెచ్చరించారు. ఎడతెరపి లేని వర్షాలతో చేనేత కార్మికులు, దినసరి కూలీలు పనులు కోల్పోయారని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర మహాసభలలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి జి కృష్ణారెడ్డి, వై ముని రాజాలు పాల్గొన్నారు.

ప్రమాదపు అంచునున్న వంతెనను పరిశీలించిన శంకర్ రెడ్డి

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలం, వెంకటరాజుల కండ్రిగ వద్ద సత్యవేడు–ఊతుకోట రహదారిపై ప్రమాదపు అంచునున్న తాత్కాలిక వంతెనను నియోజకవర్గ టిడిపి ప్రోగ్రాం సమన్వయకర్త కూరపాటి శంకర్ రెడ్డి గురువారం పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో రాజగుంట చెరువులో నీటి నిల్వ పెరగడంతో దిగువ భాగంలో ఉన్న ఈ వంతెన వద్ద నీటి ప్రవాహం పెరిగింది. అయితే రెండేళ్ల క్రితమే అప్పట్లో కురిసిన కుండ పోత వర్షాల కారణంగా ఈ వంతెనకు కోతకు గురై కొట్టుకుపోయింది. ఈ క్రమంలో వాహన రాకపోకలను పునర్దించడానికి తాత్కాలికంగా అప్పటికప్పుడు వంతెనను నిర్మించారు. అయితే ప్రస్తుతం పడుతున్న వర్షాలు మరింత పెరిగితే వంతెన కొట్టుకుపోయే అవకాశాలు లేకపోలేదు. ఈ సందర్భంగా ఆయన రోడ్లు భవనాల శాఖ అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ వంతెనను నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఇదివరకే పంపామని ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. త్వరలోనే నిధులు మంజూరు కోసం కృషి చేస్తానన్నారు. త్వరలో అధ్వాన స్థితిలో ఉన్న సత్యవేడు–ఊతుకోట ప్రధాన రహదారి పునర్నిర్మాణ పనులు ప్రారంభించిన ఉన్నట్లు తెలిపారు. రానున్న ఆరు నెలల్లో మండలంలో దెబ్బతిన్న అన్ని రోడ్లు కూడా బాగు చేయించడానికి అధికారుల ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామస్వామి, వీఆర్వో జగదీష్,టిడిపి నాయకులు మురళి(చికెన్ చిన్న) గోవిందస్వామి, తులసి రామ్,ప్రదీప్, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సునీల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావిత ప్రాంతాలలో పర్యటించిన ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు) తుపాను ప్రభావానికి గురైన కారాకొల్లు, పెద్ద కన్నలి, చిన్న కన్నలి ప్రాంతాలలో, గురువారం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుదీర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. వర్షాలు పడిన ప్రతిసారి కారాకొల్లు వాగు పొంగి ప్రవహించడంతో వాగుకు అవతలి వైపు ఉన్న సుమారు 10 గ్రామాల ప్రజల జీవనం స్తంభించి పోయిందన్నారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న దృశ్యాలను వీడియో కాల్ ద్వారా సంబంధిత మంత్రులకు చూపించి హై లెవెల్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలో నిధుల కొరత ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారానైనా బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని మంత్రులను కోరారు. అలాగే చిన్న కన్నలి ఎస్టీ కాలనీలో పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న గ్రామ ప్రజలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామంలో నిలిచిపోయిన వర్షపు నీటిని మోటార్ల సహాయంతో తొలగించే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు రావిళ్ళ మునిరాజు రావిళ్ళ నాయుడు, కన్నలి ప్రతాప్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, ఎంపీడీవో సురేంద్రనాథ్, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికే డీఎల్‌డివో కార్యాలయాలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉప ముఖ్యమంత్రి చిత్తూరు జిల్లా పర్యటన కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో పలువురు అధికారులు వీక్షించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీదేవి మాట్లాడుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో సంస్కరణలు సమర్ధవంతంగా అమలు చేయాలని డిఎల్‌డివో కార్యాలయాల ప్రారంభానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఎంపీడీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు శ్రీరామ విద్యార్థులు



క్రీడా పోటీల్లో ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి, కరకంబాడి మార్గంలోని శ్రీరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జేఎన్టీయూ అనంతపురం వారు వాకాడులోని ఎన్బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన వాలీబాల్, నెల్లూరులోని గీతాంజలి ఇన్స్ ట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన సస్ పోటీలలో శ్రీరామ కళాశాలకు చెందిన విద్యార్థులు పి.మౌనిక వాలీబాల్ లో సౌత్ జోన్ కు, కె.సుధీర్ బాబు చెస్ విభాగంలో జాతీయ స్థాయి పోటీకి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. తమ కళాశాలలో విద్యతోపాటు క్రీడల్లో విద్యార్థులు రాణించే విధంగా తర్ఫీదు ను అందిస్తున్నామన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వాసు, ఫిజికల్ డైరెక్టర్స్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పాలకులకు ముందు చూపేది..!

■ వాగుల వద్ద ప్రయాణానికి భద్రత లేదా..!! ■ సున్నపు వాగులో కొట్టుకెళ్లిన యువకులు
■ కోవనూరు వాగు పొంగి రాత్రంతా బస్టాండ్ లోనే ప్రయాణికులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ముందు చూపులేని పాలకులు, అధికారుల అనాలోచిత నిర్ణయాలు శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలోని ప్రజల పాలిట శాపాలుగా మారుతున్నాయి. శాశ్వత ప్రాతిపదికన పనులు చేయకుండా కాసుల కోసమే అన్నట్లుగా తాత్కాలిక పనులు చేపట్టడంతో ప్రజలకు భారీ వర్షాల పడ్డ ప్రతి సారీ వాగుల వద్ద ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. వాగులు, నదులు పారే చోట కల్వర్టులు, కాజ్ వేల ఎత్తు పెంచి కట్టాలన్న ముందు చూపు లేకపోవడమే ఇందుకు కారణం. నియోజకవర్గం పరిధిలోని చిట్టత్తూరు వాగు, కారాకొల్లు వాగు, సున్నపు వాగు, ఉడమలపాడు వాగు, చోడవరం వద్ద ఉన్న స్వర్ణముఖి నది, గోవిందవరం వద్ద ఉన్న స్వర్ణముఖి నదుల వద్ద ప్రయాణ కష్టాలు అధిమించేందుకు అధికారులు కల్వర్టులు, కాజ్ వేలు నిర్మించారు. అయితే వాటి ఎత్తు తక్కువగా ఉండడంతో భారీ వర్షాలకు వరదనీరు పైన ఉధృతంగా ప్రవహిస్తూ ప్రజలకు ప్రయాణ నరకాన్ని చూపిస్తున్నాయి.

సున్నపు వాగులో ఇద్దరు గల్లంతు.. దిత్వా తుపాను కారణంగా పట్టణానికి అతి సమీపంలో ఉన్న సున్నపు వాగు ఉధృతిగా ప్రవహిస్తోంది. ఆ వాగును దాటే క్రమంలో గురువారం ఉదయం తొట్టంబేడు మండలంలోని చేమూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో వెళ్తూ వరద ఉధృతికి కొట్టుకుపోయారు. చివరకు ఎలాగోలా చెట్టు కొమ్మలను పట్టుకుని ఒడ్డుకు చేరారు. ద్విచక్ర వాహనం మాత్రం వాగులో కొట్టుకుపోవడం గమనార్హం. శ్రీకాళహస్తి–పిచ్చటూరు మార్గంలోని కోవనూరు వాగు పొంగడంతో ఆర్టీసీ అధికారులు బుధవారం రాత్రి సర్వీసులను నిలిపేశారు. దీంతో 60 మంది పిచ్చాటూరు వైపు వెళ్లే ప్రయాణికులు రాత్రంతా ఆర్టీసీ బస్టాండ్ లోనే నిద్రించాల్సి వచ్చింది. కారాకొల్లు వాగు, చిట్టత్తూరు వాగులు ఉధృతిగా ప్రవహిస్తుండడంతో అవతలవైపు గ్రామాలకు ప్రజలు గత వారం రోజులుగా శ్రీకాళహస్తి పట్టణంతో సంబంధాలు తెగిపోయి నిత్యావసరాలకు అగచాట్లు పడాల్సి వస్తోంది. ఈ క్రమంలోనే గురువారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కారాకొల్లు వాగును పరిశీలించారు. ఆయనైనా వర్షాలు తగ్గు ముఖం పట్టాక నియోజకవర్గ ప్రజల ప్రయాణ కష్టాలు తీరుస్తారో లేదో చూడాలి మరి.

మెగా పేరెట్స్ మీట్..
మిడ్ డే మీల్స్ సిబ్బందికి భారం కాకూడదు : సిపిఎం


సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అండ్ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి దాసరి జనార్ధన్

ప్రజాశక్తి - పిచ్చాటూరు, బిఎన్ కండ్రిగ, కెవిబి పురం: రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా నిర్వహిస్తున్న టీచర్స్, పేరెంట్స్, స్టూడెంట్స్‌తో సంయుక్తంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ డే సందర్భంగా మధ్యాహ్నం భోజనం వంట కార్మికులకు భారం కాకూడదని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అండ్ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి దాసరి జనార్ధన్ విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని 7 మండలాల్లో ఉన్న పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఇప్పటికే మధ్యాహ్న భోజన కార్మికులకు మెనూ బాగా ఉండాలని రోజు వండే దానికంటే అదనంగా స్వీట్లు, ఆకుకూరలు, గుడ్డు అదనంగా పప్పు వేసి చక్కగా రుచిగా వండి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మధ్యాహ్నం భోజనం పెట్టాలని, ఖర్చు మీరే భరించుకోవాలని హుకుం జారీ చేయడం దారుణమన్నారు. ఇప్పటికే మధ్యాహ్నం భోజనం కార్మికులు తమ సొంత నిధుల నుండి అప్పో,సప్పో చేసి వంట చేసి పిల్లలకు పెట్టి ప్రభుత్వం దయా దాక్షణ్యాల మీద ఇచ్చినప్పుడు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులలో ప్రతి నెల తూచా తప్పకుండా వేతనాలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు ఇలా మధ్యాహ్న భోజన కార్మికులపై హుకుం జారీ చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఈ అదనపు ఖర్చుకు చెల్లిస్తుందో లేదో చెప్పలేని పరిస్థితులలో మండల విద్యాశాఖ అధికారులు ఉన్నప్పటికీ, ఉపాధ్యాయులు మాత్రం అధికారుల మెప్పు కోసం హడావుడి చేయడం మంచిది కాదని హితవు పలికారు. ఉపాధ్యాయులు అంతగా ఆరాటపడి బాగా వండాలి అనుకుంటే వారి సొంత డబ్బులు వెచ్చించి మంచి వంటలు చేయించి తదుపరి ప్రభుత్వం ఇచ్చిన తర్వాత వారు తీసుకోవడం మంచిదని జనార్ధన్ తెలిపారు.ఎక్కడైనా బలవంతం గా ఉపాధ్యాయులు ఒత్తిడి తీసుకువస్తే జిల్లా కలెక్టర్, డీఈవో, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి పైన తగు చర్యలు తీసుకునేందుకు వెనుకాడమని ఈ సందర్భంగా తెలిపారు.

కాంగ్రెస్ తిరుగులేని శక్తిగా ఎదగాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): భారతదేశంలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా ఎదగడానికి సంస్థాగత పార్టీ నిర్మాణ కార్యక్రమానికి రాహుల్ గాంధీ శ్రీకారం చుట్టారని, క్షేత్ర స్థాయిలో పటిష్టంగా చెయ్యడానికి తాను ఏఐసీసీ ఆదేశాలతో పరిశీలకురాలుగా తిరుపతి జిల్లాకు వచ్చానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ సుధా రామకృష్ణన్ తెలిపారు. గురువారం తిరుపతి నగర పరిధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో తిరుపతి జిల్లా, నగర అధ్యక్షుల ఎంపిక ప్రక్రియకు సంబంధించి దరఖాస్తుల స్వీకారం చేసినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. తిరుపతి జిల్లా అధ్యక్ష పదవికి 12 మంది, నగర అధ్యక్ష పదవికి ముగ్గురు దరఖాస్తులు చేసినట్లు ప్రస్తుత నగర అధ్యక్షులు చిట్టిబాబు వివరించారు.

పట్టణ పార్టీ అధ్యక్ష అభ్యర్థి విషయంలో పునరాలోచించాలి



ప్రజాశక్తి - నాయుడుపేట: పార్టీ అధ్యక్ష పదవి అభ్యర్థి విషయంలో మరోసారి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, నిన్న మొన్నటిదాకా వైసీపీ పార్టీలో ఉండి టిడిపి నాయకుల్ని అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేసి, ఈరోజు పార్టీలో చేరిన వాళ్లకి పట్టణ పార్టీ అధ్యక్ష పదవి కట్టబెట్టకూడదని పట్టణ టిడిపి యువ నాయకుడు దార్ల.రాజేంద్ర పేర్కొన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంను పట్టణ టిడిపి అధ్యక్షుడు పదవిని నిన్న మొన్న పార్టీలో చేరిన ఎస్కే రఫీకి ఇవ్వవద్దని పట్టణ టిడిపి నాయకుల తరపున రాజేంద్ర వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2019లో పార్టీ ఓడిపోయినప్పటి నుంచి ఎన్నో అవమానాలను ఎన్నో కష్టాలను ఓర్చుకుని నిలబడి పార్టీ విజయం సాధించడానికి అహర్నిశలు శ్రమించిన వారు ఎంతోమంది ఉన్నప్పుడు నిన్న మొన్న పార్టీలో చేరిన వారికి పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వాలనుకోవడంపై పట్టణ నాయకులందరూ అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఈ ఎస్ కే రవి అనే వ్యక్తి వైసిపి పార్టీ అధికారంలో ఉండగా పట్టణ టిడిపి నాయకులపై అనేక అరాచకాలకు పాల్పడ్డాడని, ఎన్నో విధాలుగా టిడిపి వాళ్ళని ఇబ్బందులకు గురి చేశాడని అలాంటి వ్యక్తికి ఇలాంటి పదవి ఇవ్వడం సరికాదని ఇది నా ఒక్కడి విజ్ఞప్తి కాదని పార్టీలోని ప్రతి ఒక్కరు ఎస్ కే రఫీని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు.ఈ పదవికి ఎన్నాళ్ళ నుంచో పార్టీలో ఉన్న వారికి ఇవ్వాలని లేదా ఉన్నవారినే కొనసాగించాలని, ఒకసారి పూర్తిగా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని నెలవల సుబ్రహ్మణ్యంను, ఎమ్మెల్యే విజయశ్రీని కోరారు.

డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయ ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయ ప్రారంభం అనేది చరిత్రలో నిలిచిపోయే రోజని శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జీవనోపాదుల వనరుల శిక్షణ కేంద్ర భవనాన్ని డివిజనల్ అభివృద్ధి కార్యాలయం భవనంగా గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి, కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డి.డి.ఓ కార్యాలయం ఏర్పాటుతో మండల, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడానికి డిప్యూటీ సీఎం మంచి కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేయాలని, ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్‌లో కూడా పనితీరు సూచించారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండలం టీడీపీ మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజు నాయుడు, డి.ఎల్.డి.ఓ సుస్మిత, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రంగనేని చెంచయ్య నాయుడు, జడ్పిటిసి వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిటిడి ఉద్యోగుల సమస్యలపై ఈఓ సానుకూలం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టీటీడీ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ (సిఐటియు) ప్రతినిధి బృందంతో టీటీడీ ఈఓ, ఉన్నతాధికారులతో బుధవారం చర్చలు జరిపారు. పల్లం వద్ద 5,200 మంది ఉద్యోగులకు ఇంటి స్థలాల అభివృద్ధి పనులైన రోడ్లు , విద్యుత్, కాలువలు, నీటి సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులు కల్పిచడానికి సుమారు రు. 200 కోట్లకు పైగా ఖర్చు అవుతుందని ఇంజినీరింగ్ అధికారులు బడ్జెట్ తయారు చేశారు. వసతులకు అయ్యే ఖర్చులో టీటీడీ 75శాతం ఉద్యోగుల నుండి 25 శాతం వసూలు చేసే విధానం గతంలో ఇంటి స్థలాలు కేటాంచినపుడు టీటీడీ తీసుకున్న నిర్ణయం. అదేవిధానాన్ని పాదిరేడు ఇంటిస్థలాలకు కూడా వర్తింపచేయాలని ఈవోను కోరారు. ఈ విషయాలను టీటీడీ చేర్మెన్, పాలకమండలి సభ్యుల దృష్టికి తీసుకెళ్లాలని తెలియజేశారు. అదేవిదంగా వివాదంలో వున్న భూమిని అడగగా – తిరుపతి జెఈఓ, కలెక్టర్‌ని కలిసి పరిష్కరించాలని సూచించారు. పల్లాం వద్ద భూమి కొనుగోలుకు ఇప్పటికే రూ. 80 కోట్లు చెల్లించారు. మిగిలిన భూమిని వెంటనే స్వాధీనం చేసుకొని, లేఅవుట్ వేసి, ప్లాట్లు ఉద్యోగులు మరియు పెన్షనర్లకు కేటాయించాలని కొరగా, జెఈఓ, ఎస్టేట్ అధికార్లకు త్వరగా భూమిని స్వాధీనం చేసుకోమని ఆదేశించారు. టీటీడీ ఎంప్లాయిస్ హెల్త్ ఫండ్, పదోన్నతులు, వంటి సుమారు 21 సమస్యలపై అధికారులతో ఉద్యోగులు చర్చించారు. ఉద్యోగుల సమస్యలను టీటీడీ ఈవోతో పాటు అధికారులు విని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో, ఉద్యోగులు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో టీటీడీ అధికారులు ఎఫ్ ఏ అండ్ సిఏఓ బాలాజీ, చీఫ్ ఇంజనీర్ టి.వి సత్యనారాయణ, చీఫ్ మెడికల్ ఆఫీసర్ కుసుమ కుమారి, దేవస్థానం విద్యా శాఖాధికారి వెంకట సునీల్, టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ (సిఐటియు) నాయకులు గోల్కొండ వెంకటేశం, నైనార్ పద్మనాభం, కాటా గుణశేఖర్, పి.రాము, పి.దయాకర్, సిపిఎస్ యూనియన్ వెంకటముని రాజు, ఆదిలక్ష్మి, దారా రవికుమార్, మునికిరణ్ కుమార్, శివయ్య, శ్రీలక్ష్మి, హనుమంత్ రెడ్డి, బాలాజీ, మురళి మోహన్, ధనంజయులు, మధు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

గరుడ వారధిపై నుండి దూకి వ్యక్తి మృతి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: గరుడ వారధిపై నుండి దూకి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం తిరుపతిలో చోటు చేసుకుంది. అలిపిరి పోలీసుల కథనం మేరకు అలిపిరి పోలీస్ స్టేషన్ సమీపంలోని మీసేవ కేంద్రం ఎదురుగా గురువారం మధ్యాహ్నం 45 నుంచి 50 సంవత్సరాలు ఓ వ్యక్తి ఫ్లై ఓవర్ నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కింద పడిన అతని తలకు గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం ఎక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. మృతుడిని ఎవరైనా గుర్తింస్తే, అలిపిరి పోలీసులను సంప్రదించాలని కోరారు.

కళ్యాణికి డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధన విద్యార్థిని కళ్యాణి కశెట్టికి డాక్టరేట్ ప్రధానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు. ఈమె ప్రొఫెసర్ శైలజ, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ మార్గదర్శకత్వంతో "డెవలప్మెంట్ ఆఫ్ క్వాలిటటివ్ అండ్ క్వాంటిటేటివ్ అనలైటికల్ మెథడ్స్ ఫర్ సమ్ ఫైటోకెమికల్ మార్కర్స్" అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించారు.

దళిత వాడకు తాగునీటి మోటార్లు ఏర్పాటు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదేశాల మేరకు, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి డైరెక్టర్ గంజి మాధవయ్య ఆధ్వర్యంలో పుత్తూరు మండలం వేపగుంట పంచాయితీ, వేపగుంట హరిజనవాడలో పిఎంఎంజెవై పథకం కింద 3 లక్షల రూపాయల నిధులతో తాగు నీటి మోటార్లు ఏర్పాటు చేశారు. వేపగుంట హరిజనవాడలో ప్రజలు మూడు రోజులుగా నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుక్కు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించి బోర్లు వేయించారు. ఈ కార్యక్రమంలో రూరల్ పార్టీ అధ్యక్షులు అరవ బాలాజీ, ప్రధాన కార్యదర్శి హేమంత్ కుమార్, మాజీ ఎంపీటీసీ కవిత, ఐటీడీపీ బుజ్జి బాబు, గ్రామ కార్యదర్శి కిరణ్, రమేష్ బాబు, గౌతమి, రజిని, సజ్జమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలో ఇళ్ళు లేని నిరుపేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. గురువారం నారాయణవనం, ఎన్టీఆర్ కాలనీలో ఆయన పర్యటించారు. ప్రజా దర్బార్‌లో ప్రజల నుండి స్వీకరించిన 230 అర్జీలలో 190 ఇంటి పట్టాలు కోరుతూ ఇచ్చినవేనని తెలిపారు. వీటి పరిష్కారంలో భాగంగా, ఈ కాలనీలో గతంలో 13 ఎకరాలు ల్యాండ్ అక్విజిషన్ చేసి సుమారు 600 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఈ కాలనీలో ఇంకా మిగిలి ఉన్న భూమిని సుమారు 300 మందికి ఇవ్వొచ్చని, ఇంటి పట్టాలు పంపిణీకి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. అనంతరం నారాయణవనం మండలం, కీలగరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లలో నాణ్యత పాటించండి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: అన్న క్యాంటీన్లలో నాణ్యమైన ఆహార పదార్థాలు అందజేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి ఈఎస్ఐ హాస్పిటల్స్ సమీపంలోని అన్న క్యాంటీన్లో కమిషన్ ఆకస్మిక తనిఖీ చేశారు. టోకెన్లు క్రమపద్ధతిలో ఏ పూటకాపూట అందించాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. ప్రజల కు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. నాణ్యత లోపిస్తే సంబంధిత క్యాంటీన్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత్రలు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఆహార పదార్థల పంపిణీలో ఒకే సమయం పాటించాలని నిర్వాహకులకు సూచించారు.

గిరిజన కుటుంబాలను ఆదుకుంటాం

ప్రజాశక్తి -కోట : కోట మండలం, సిద్దవరం పంచాయతీలో పలువురు గిరిజిన కుటుంబాలకు గురువారం సిద్దవరం టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో భోజన పొట్లాలు అందజేశారు. తుపానుతో పనులకు వెళ్లలేక గుడిసెల్లోనే బిక్కుబిక్కు మంటున్న గిరిజన కుటుంబాలను టీడీపీ నాయకులు ఆదుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ యువ నాయకులు ఇంగిలాల రామ్మోహన్ మాట్లాడుతూ గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సిద్దవరం టీడీపీ నాయకులు ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు పిండి.వెంకట కృష్ణయ్య, సిద్ధవరం సర్పంచ్ ఇంగిలాల సుజాతమ్మ, టిడిపి నాయకులు ఇంగిలాల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

2026 క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: జీసస్ వర్డ్ ఆఫ్ లైఫ్ మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన 2026 క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐపీఎస్ అధికారి శంక బ్రాత భగ్ని, విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లోకంలో ప్రజలందరూ శాంతి, ప్రేమతో ఉండినట్లయితే లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమే లేకుండా శాంతితో కూడిన సమాజం ఉంటుందని అన్నారు. అనంతరం ఎలమంచిలి ప్రవీణ్ రూపొందించిన 2026 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరవపాల్, బాబి, సుదర్శన్ రావు, తేజ, ఆశీర్వాదం, రమణ, సోనీ ఇజాక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి పరిధిలోని సౌత్ సెక్షన్ 33/11 కె.వి కేన్సెస్ ఫీడర్ మెయింటెనెన్స్, లైన్ క్లియరెన్స్ కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాల అంతరాయం కలుగుతుందని ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి అర్బన్ ఈఈ సి.గంగాధర్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉదయి ఇంటర్నేషనల్ హోటల్, మారుతి హాస్పిటల్ , రైల్వే హెచ్.టి.టి.టి.డి. రెండవ సత్రం, గాంధీపురం, వెంకటరెడ్డికాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.